సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 15 । నవంబర్ । 2022

వంజంగి హిల్స్‌పై సందడే సందడి



సాక్షి,పాడేరు: మేఘాలు,పొగ మంచు, ప్రకృతి అందాలకు నిలయమైన వంజంగి హిల్స్‌కు రోజూ పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మూడు రోజుల్లో వేలాది మంది పర్యాటకులు సందర్శించారు. సోమవారం వేకువజాము నుంచి ఉదయం 10గంటల వరకు పర్యాటకులు వంజంగిలో ప్రకృతి అందాలను వీక్షించి, సందడి చేశారు.

కూల్..కూల్



సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచు విపరీతంగా కురుస్తోంది.

మినుములూరు	:	13 డిగ్రీలు
అరకులోయ	:	13.9 డిగ్రీలు,
చింతపల్లి	:	15.5 డిగ్రీలు

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గోపి బాధ్యతల స్వీకరణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి అభినందనలు తెలుపుతున్న బులికృష్ణ

విశాఖ లీగల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గుత్తుల గోపి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి రమణారావు ప్రధాన న్యాయమూర్తికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ, ఏవో కె.రమేష్, నాజర్ సత్యనారాయణ, ముఖ్య పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: కష్టపడి చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం బహుమతులు అందజేశారు.

సోలార్ కంచెతో పంటలకు రక్షణ



సోలార్ కంచె ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మార్టేరు శాస్త్రవేత్తలు

రాజవొమ్మంగి: సోలార్ కంచెతో పశువులు, వన్యప్రాణుల బారి నుంచి పంటలను రక్షించుకోవచ్చని మార్టేరు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. రాజవొమ్మంగి మండలం సింగంపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం రూ.20వేల వ్యయంతో సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి కోతులు, ఇతర వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. వరిని ఆశిస్తున్న నల్లదోమ, తెల్లదోమలను కట్టడి చేసే విధానంపై రైతులకు సూచనలు ఇచ్చారు. అధికంగా రసాయన ఎరువుల వినియోగం వల్లే చీడపీడలు పెరిగిపోతున్నాయని చెప్పారు. శిక్షణ అనంతరం నాగరాజు అనే రైతు వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ కంచెను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్‌నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు చీడిపల్లి అప్పారావు, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. సేవలు సూపర్

ఈ చిత్రంలో వ్యక్తి పేరు రాజు. ముంచంగిపుట్టు మండలం పెదగూడ **గ్రామానికి** చెందిన ఈయన హైబీపీ, షుగర్ వ్యాధి కారణంగా **నడవలేని** పరిస్థితిలో ఉన్నాడు. గతంలో వైద్య సేవల కోసం పది కిలో **మీటర్ల దూ**రంలో ఉన్న ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి ఆటోలో **వెళ్లిరావ**ల్సి వచ్చేది. అక్కడ గంటల కొద్దీ క్యూలో వేచి ఉంటేనే వైద్యం **అందేది. ఇప్పుడా అ**వస్థలు తప్పాయి. ఇంటి దగ్గరకే డాక్టర్, వైద్య సిబ్బంది వచ్చి **షుగర్ స్థాయిని పరి**శీలించి, అవసరమైన మందులు అందజేస్తున్నారు. రెండు **స్లారు ఆరోగ్య పరిస్థి**తి విషమంగా ఉంటే కిలగాడ పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్య **సేవలు అందించి ఇం**టికి తీసుకువచ్చారు. ఈయనలా నడవలేని,కదలేని పరిస్థితిల్లో **ఉన్నవారికి ఫ్యామిలీ** డాక్టర్ విధానంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.



దీర్ఘకాలిక వ్యాధితో గడప దాటలేని పరిస్థితి ఒకరిది... చేతిలో చిల్లి గవ్వలేక ఆస్పత్రికి వెళ్లలేని దుస్థితి ఇంకొకరిది...దూరాభారంగా ఉన్న పీహెచ్‌సీకి వెళితే కూలిపని పోతుందన్న భయం వేరొకరిది..దీంతో వ్యాధి వంటిని గుల్ల చేస్తున్నా... శరీరం కృశించిపోతున్నా.. దవాఖానాకు వెళ్లకుండా చాలా మంది ఇంటిలోనే సొంత వైద్యం చేసుకునో.. పసరు మందు వేసుకునో ముదరబెట్టుకుంటున్నారు. కొన్ని రోజుల తరువాత ఆస్పత్రికి వెళ్లే సరికి పరిస్థితి చేజారిపోతోంది. ఈ పరిస్థితుల నుంచి పేదలకు విముక్తి కల్పించి, ఇంటి వద్దే వైద్యం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించింది. ఏజెన్సీ పల్లెల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దార్రెలలో ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ రమేష్,సిబ్బంది

- గిరి పల్లెల్లో అందుబాటులో ఫ్యామిలీ ఫిజీషియన్
- లేవలేని స్థితిలో ఉన్నవారి ఇంటికి వెళ్లి వైద్య సేవలు
- 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు
- జిల్లాలో 63 పీహెచ్‌సీల పరిధిలో అమలు

ముంచంగిపుట్టు: గతంలో చాలా గ్రామాల్లో వైద్యం అందని ద్రాక్షే. సుదూరంలో ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లినా డాక్టర్ వస్తారో లేదో తెలియని దుస్థితి. మందులుంటాయో, ఉండవో చెప్పలేని పరిస్థితి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితులు పూర్తిగా మారాయి. విద్యావైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీటవేస్తున్నారు. దీంతో మారుమూల గ్రామాల్లో సైతం వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా ఇంటి వద్దే వైద్యసేవలందించేందుకు వీలుగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గిరిజనులకు వరమైంది. ధనవంతులకే సొంతమైన ఫ్యామిలీ డాక్టర్ పేదలకు కూడా అందుబాటులోకి రావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల నుంచి మొదలైన ఈ విధానంలో వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దే 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులతో వైద్యసేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించి, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ విధానం ముఖ్య ఉద్దేశం. ధనికుల కుటుంబాలకు ఫ్యామిలీ డాక్టర్ అంటూ ఒకరు ఉంటారు.అరందరి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూ ఉంటారు.అదే తరహాలో పల్లె ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందిస్తున్నారు.



104 వాహనంలో వైద్య సేవలకు బయలుదేరుతున్న కిలగాడ ఫ్యామిలీ డాక్టర్,వైద్య సిబ్బంది

120 మంది ఫ్యామిలీ డాక్టర్స్ నియామకం

జిల్లాలో 22 మండలాల్లో 63 పీహెచ్‌సీల పరిధిలో 120 మంది ఫ్యామిలీ డాక్టర్స్‌ను ప్రభుత్వం నియమించింది.104 వాహనాలు 29 ఉన్నాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 296 ఉన్నాయి.వీటి పరిధిలో జిల్లాలో 29 చోట్ల ప్రతీ రోజు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు అవుతోంది. ప్రతీరోజు ఉదయం 9గంటలకే షెడ్యూల్ ప్రకారం ఫ్యామిలీ డాక్టర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఆశ వర్కర్లు 104 వాహనంలో గ్రామానికి వెళ్తున్నారు. మొదట విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు.గ్రామ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులు, చిన్నారులు,గర్భిణులు,బాలింతల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్నారు.అనంతరం గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నారు.హెచ్‌బీ(హిమోగ్లోబిన్), ఆర్‌బీఎస్, మలేరియా, డెంగ్యూ,వాటర్ టెస్టింగ్, ప్రెగ్నెన్సీ టెస్ట్,హెచ్ఐవీ,స్పూటమ్ ఫర్ ఏఎఫ్‌బీ,హెచ్‌బీఎస్ఏజీ,టెస్ట్ ఫర్ ఐయోడిన్ ఇన్ సాల్ట్ టెస్ట్ వంటి పరీక్షలు చేస్తూ వైద్య సేవలను అందిస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనం

ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుండడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఆధునిక హంగులు,పూర్తిస్థాయిలో సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. 108 వాహనాల ద్వారా సకాలంలో రోగులను ఆస్పత్రికి తరలించడం,104 వాహనం ద్వారా వైద్య శిబిరాల నిర్వహణ, విలేజ్ క్లినిక్‌లతో గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్యం ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందిస్తుండడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మేలు



ప్రజాసంక్షేమంతో పాటు విద్య,వైద్య,వ్యవసాయం తదితర రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ధనవంతులకే సొంతమైన ఫ్యామిలీ డాక్టర్ విధానం గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది.లేవలేని స్థితిలో ఉన్న రోగుల ఇంటి వద్దకు డాక్టర్ వెళ్లి వైద్య సేవలందించడం చాలా సంతోషించాల్సిన విషయం. మంచి పాలకుడు ఉంటే మంచి సేవలు అందుబాటులోకి వస్తాయి.

-చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు నియోజకవర్గం

రోజూ 29 గ్రామాల్లో సేవలు



ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో ప్రారంభమైంది. నిత్యం గ్రామాల్లో డాక్టర్ అందుబాటులో ఉండడం వల్ల సత్వర వైద్యం, అవసరమైన మందులు అందించే అవకాశం ఉంటుంది. జిల్లాలో ప్రతీ రోజు 29 గ్రామాల్లో 120 మంది ఫ్యామిలీ డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు.

-టి.విశ్వేశ్వరరావు నాయుడు, ఫ్యామిలీ డాక్టర్స్ నోడల్ అధికారి

గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

రంపచోడవరం పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజనుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి, వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో సీహెచ్ శ్రీనివాస్ రావుతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, గ్రామాల సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరించి, కొన్నింటిని పరిష్కరించారు. బ్రెయిన్ టీబీతో బాధపడుతున్న తనకు వైద్యం కోసం ఆర్థిక సాయం చేయడంతో పాటు రెండు కాళ్లు పనిచేయనందున పింఛన్ మంజూరు చేయాలని గుజ్జుమామిడివలస గ్రామానికి చెందిన మొట్టిం శంకరప్రసాద్ కోరారు. తమ కుమార్తె పూసం రజనీ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోందని, వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని కుందాడ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు పీవోకు అర్జీ అందజేశారు. వేటుకూరు నుంచి మద్దిపీడు, గాలికోపురం నుంచి నీలవరం గ్రామాల మధ్య అటవీ అభ్యంతరాలు తొలగించి రోడ్డు నిర్మాణం చేయాలని గిరిజనులు కోరారు. డీఎల్ఎస్‌సీ కేసులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె నారాయణరావు, గసిడే బాబురావులు కోరారు. పుల్లంగి పంచాయతీలోని గ్రామాలకు సోలార్ లైట్లు ఇవ్వాలని సర్పంచ్ వి.జార్జిబాబు విజ్ఞప్తి చేశారు. సిరిమెట్ల గ్రామంలోని వ్యవసాయం కోసం త్రీఫ్యూజు కరెంటు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరావు, ఈఈ డేవిడ్‌రాజు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు ఏవో డీఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్

విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన అవసరం

చింతపల్లి రూరల్: విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ సురేష్‌కుమార్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పంటలపై వారికి ఏడీఆర్ సురేష్ కుమార్ అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు అగ్రిటూరిజంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, వారు రూపొందించిన చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం ఏడీఆర్ మాట్లడుతూ ప్రస్తుతం వ్యవసాయంపై ప్రజలకు ఆసక్తి సన్నగిల్లుతోందన్నారు. ఏజెన్సీ వాతావరణం వివిధ రకాల పంటల సాగుకు అనువుగా ఉంటుందని విద్యార్థులు పంటలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త సీతరామ్,శాస్త్రవేతల్లు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్

చింతపల్లిలో 'తుపాను హెచ్చరిక'



క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభిస్తున్న సన్యాసిపాత్రుడు

చింతపల్లి: స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో 'తుపాను హెచ్చరిక ' అనే నూతన సినిమా షూటింగ్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు సోమవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. శ్రీపాద క్రియేషన్స్,వింటేజ్ సరయు, తలశిల సమర్పించు 'తుపాను హెచ్చరిక' అనే చిత్ర షూటింగ్‌ను 20 రోజుల పాటు ఆంధ్రా కశ్మీర్ లంబసింగి ప్రాంతంలో జరపనున్నట్టు డైరెక్టర్ కె.కె జగదీష్ తెలిపారు. హీరోహీరోయిన్లుగా రాఖీ,సుహనా నటిస్తున్నట్టు తెలిపారు. నిర్మాతలుగా శ్రీనివాస్ కిషన్, ఎస్.రజినీకాంత్ వ్యవహరిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వార్డెన్ వినాయకరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

బదిలిపొర ఎన్‌కౌంటర్ బూటకం

మావోయిస్టు నేత రాకేష్ పేరుతో లేఖ



సాక్షి,పాడేరు: ఒడిశా రాష్ట్రం బైపరగుడ బ్లాక్‌లోని మాలిపాదర్, బదిలిపొర ప్రాంతంలో ఈనెల 10న ఎన్‌కౌంటర్ జరిగినట్టు పోలీసులు చెబుతున్నారని, అది వట్టి బూటకమని పేర్కొంటూ మావోయిస్టు పార్టీ మల్కన్‌గిరి-కోరాపుట్ బోర్డర్ డివిజన్ కమిటీ కార్యదర్శి రాకేష్ పేరిట సోమవారం లేఖ విడుదలైంది. కూంబింగ్‌కు వెళ్లిన ఎస్‌వోజీ పోలీసులపై ముందుగా మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారని, ఆ తరువాత పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారని, మావోయిస్టుల తుపాకులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు అబద్ధపు ప్రకటనలు ఇచ్చారని ఈలేఖలో రాకేష్ పేర్కొన్నారు. మథిలి బ్లాక్ సరిగిగూడ గ్రామానికి చెందిన ధోనోకమార్‌తో పాటు,మరో సాధారణ కూలీ పోలీసు కాల్పుల్లో మృతి చెందారని, వారు బతుకు తెరువు కోసం గంజాయి వ్యాపారుల వద్ద కూలీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. రాత్రీపగలు అటవీ ప్రాంతాల్లో పేదకూలీలు మకాం వేస్తుంటారని, వీరిపై పోలీసులు కాల్పులు జరిపారని పేర్కొన్నారు. తప్పు కప్పిపుచ్చుకోవడానికే... మావోయిస్టులపై కాల్పులు జరిపామని పోలీసులు బూటకపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గతంలోనూ పోలీసుల కాల్పుల్లో సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని, అమానుషంగా పోలీసులు కాల్చిచంపుతున్నారని పేర్కొన్నారు. దీనికి అధికార బీజేడీ పార్టీ బాధ్యత వహించాలని, బూటకపు ఎన్‌కౌంటర్‌పై తక్షణమే న్యాయవిచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని,బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బదిలిపొర ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈనెల 18న మల్కన్‌గిరి,కోరాపుట్ జిల్లాల బంద్‌ను పాటించాలని రాకేష్ ఈలేఖలో విజ్ఞప్తి చేశారు.

ముంపు ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురుతున్న ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు తెలిపారు. దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా పోశమ్మగండి ఆలయంతో పాటు విలీన మండలాల్లో మరో ఆరు దేవాలయాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఈ ఆలయాలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు.మూడు నెలలుగా గోదావరి వరదల్లో ముంపునకు గురైన గండిపోశమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, రాజమహేంద్రవరం తదితరులు పాల్గొన్నారు.

కార్తీక కాంతులు





విశాఖ సాగర తీరంలో మహా కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు, (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుని ఉత్సవమూర్తులు

- సాగర తీరంలో భక్తి నివేదన
- మార్మోగిన గోవింద నామస్మరణ
- ఘనంగా మహా కార్తీక దీపోత్సవం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): సాగర తీరం భక్తజన సంద్రమైంది. గోవింద నామస్మరణతో మార్మోగింది. టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ సాగర తీరంలో మహా కార్తీక దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేల సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. దీపపు కాంతులతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముందుగా వైఎంసీఏ నుంచి ఆర్కే బీచ్ వరకు శోభాయాత్ర ద్వారా వేంకటేశ్వర స్వామిను తీసుకొని వచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ సముద్ర తీరాన టీటీడీ అధికారులు మహా దీపోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహా దీపోత్సవ కార్యక్రమానికి అద్భుతమైన ఏర్పాట్లు చేశారన్నారు. హైందవ ధర్మాన్ని ప్రచారం చేయటంలో టీటీడీ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో దేవాలయాలను నిర్మించిందన్నారు. ఈ మధ్య రుషికొండ వద్ద దేవాలయం ఏర్పాటు చేయటంతో ఒక వైపు సింహాద్రి అప్పన్న, మరో వైపు వెంకన్నతో వైజాగ్ ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకుందన్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సుందర సాగర తీరంలో అశేష భక్తజనంతో కార్తీక దీపోత్సవం జరుపుకోవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. హైందవ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేష ప్రాముఖ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు



దీపంతో పూజిస్తున్న మంత్రి అమర్‌నాథ్ దంపతులు


గూడెంకొత్తవీధి: కేజీబీవీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన


అరకులోయ రూరల్: డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ జి.డి.బాబు


రంపచోడవరం: బాలల దినోత్సవంలో ఎంపీపీ బందం శ్రీదేవి, వైస్ ఎంపీపీ


పాడేరు రూరల్: వంట్లమామిడిలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు

పిల్లలు.. దేవుడు.. చల్లనివారే!

- ఆటపాటలతో చిన్నారుల సందడి
- వేడుకగా బాలల దినోత్సవం
- గ్రంథాలయాల వారోత్సవాలు ప్రారంభం


అడ్డతీగల: నెహ్రూ జయంతి నిర్వహిస్తున్న ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు తదితరులు

జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో సోమవారం బాలల దినోత్సవం ఆద్యంతం ఆసక్తిగా ఉత్సాహంగా సాగింది. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పిల్లలు... దేవుడు.. చల్లనివారే.. కల్లకపటమెరుగని కరుణామయులే అంటూ ఆటపాటలతో సందడి చేశారు. చాచా నెహ్రూకు ఇష్టమైన గులాబీలతో ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పలువురు వక్తలు చిన్నారులనుద్దేశించి మాట్లాడారు. బాలలు బాగుంటేనే దేశం బాగుంటుందని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో గ్రంథాలయాల వారోత్సవాలను వక్తలు ప్రారంభించారు. వాటి ఆవశ్యకతను వివరించారు. - సాక్షి నెట్‌వర్క్


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం


హుకుంపేట: మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు

సీలేరులో విదేశీయుల సందడి


సీలేరులో చర్చి పాస్టర్‌తో విదేశీయులు..

సీలేరు: సీలేరులో 16 మంది విదేశీయులు స్థానికులతో కలిసి సందడి చేశారు. యూసీఐఎం సంస్థ అధినేత కేఆర్ సింగ్ ఆధ్వర్యంలో వీరు సోమవారం సాయంత్రం ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా కేఆర్ సింగ్, యూసీఎం చర్చ్ పాస్టర్ మనిషేలు విదేశీయులకు పూలమాలతో ఆహ్వానం పలికారు. సీలేరు సమీప ఒడిశా ప్రాంతమైన ఓ గిరిజన గ్రామంలో 200 మంది గిరిజనులకు వారు రగ్గులు పంపిణీ చేశారు. శీతాకాలంలో కావడంతో ప్రస్తుతం మన్యంలో ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వారు ఆస్వాదించారు. గిరిజన ప్రాంత సంప్రదాయంతో విదేశీయులకు ఆహ్వానం పలకడంతో వాటి పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు గుల్లిపాడు స్టేషన్ల మధ్య విశాఖపట్నం వైపు వెళ్లిన రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి సోమవారం మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుని వయసు 48 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై పసుపురంగుపై నలుపు చారల చొక్కా, చొక్కా లోపల ఎరుపు రంగుపై నలుపు, తెలుపు అడ్డచారల టీ షర్ట్, నీలం రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో ఉంచారు.

అరకు ఘాట్‌లో ట్రాఫికర్


అనంతగిరి-అరకు ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

సాక్షి,పాడేరు: పర్యాటకుల సీజన్ కావడంతో అనంతగిరి–అరకు ఘాట్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. విశాఖపట్నం నుంచి అరకులోయకు ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. శని, ఆది, సోమవారాల్లో పర్యాటకుల వాహనాలు అధికంగా సంచరిస్తుంటాయి. ఘాట్‌లోని పలు చోట్ల వాహనాలను రోడ్డు పక్కన నిలిపి, ఇక్కడ ప్రకృతి అందాలు వీక్షిస్తుంటారు. ఆ సమయంలో ఇరువైపులా వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయే పరిస్థితితో పర్యాటకులతోపాటు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డముకు వ్యూపాయింట్, బొర్రాగుహలు జంక్షన్, పలు కాఫీ తోటల జంక్షన్లు, గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట వారపుసంతలో ఆదివారం రోజున ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు మరింత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న అంతర్మథనం, వేదన నాటికలు

వీరునాయుడు స్మారకంగా నాటికల ప్రదర్శన


నాటిక ప్రదర్శనలు ప్రారంభిస్తున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, గ్రామపెద్దలు

మునగపాక: స్థానిక నందీశ్వర తులసీ కళావేదికపై సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాటకరంగ దర్శకుడు, విశ్రాంత ఉపాధ్యాయులు సర్గీయ వెలగా వీరునాయుడు జ్ఞాపకార్థం పలు నాటికలు ప్రదర్శించారు. వీరునాయుడు మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటికలను ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. మొదటిగా ప్రదర్శించిన అంతర్మథనం నాటిక ఆహుతులను అలరించింది. ఈ నాటికకు ఆడారి సోమశేఖర్ రచన అందించగా మళ్ల కృష్ణ దర్శకత్వం వహించారు. అలాగే ద్వితీయ ప్రదర్శనలో వేదన నాటిక ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. ఆడారి సోమశేఖర్ రచన చేయగా సూరిశెట్టి రమణ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన వీరునాయుడు అందరికీ ఆదర్శం కావాలన్నారు. కళారంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల సంజీవరావు, దాడి శ్రీరామ్మూర్తి, అలంక ప్రకాశరావు, వీరునాయుడు మాష్టారు కుమారుడు శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలో మహిళపై కత్తితో దాడి

గొలుగొండ : పాకలపాడు గ్రామంలో భూ తగాదా కారణంగా గంగయ్యమ్మ అనే మహిళ గాయపడింది. గంగయ్యమ్మ భూమికి ఆనుకొని గ్రామానికి చెందిన పకీరునాయుడు భూమి ఉంది. సోమవారం రీ సర్వే చేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో చేతిలో కత్తితో పకీరునాయుడు గంగయ్యమ్మ తలపై కొట్టడంతో గాయపడింది. ఆమెను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. ఎస్ఐ నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సహాయం చేయాలని పీవోకు వినతి


పీవో సురజ్ గానోరేకు వినతి పత్రం ఇస్తున్న వరప్రసాద్ దొర, బంధువులు

మారేడుమిల్లి: మండలంలోని జీఎంవలస గ్రామానికి చెందిన మొట్టెం శివశంకర్ వర ప్రసాద్ దొర (22) నాలుగేళ్లుగా బ్రెయిన్ టీబీ, పుట్టుకతో 90 శాతం అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. అతడిని తల్లిదండ్రులు కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించినా ఫలితం లేదు. చివరికి చేతిలో చిల్లిగవ్వలేక వైద్య సేవలు చేయించుకోలేని స్థితిలో అతడి బంధవులు సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో స్పందన కార్యక్రమానికి తీసుకొచ్చారు. అక్కడ పీవో సురజ్ గానోరేకు మొరపెట్టుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలకు సహాయం చేయాలని, దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ..


చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న ఐటీడీఏ పీఓ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

వీఆర్‌పురం: బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బాలల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. బాలల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వరంలో ఏటా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనసీయమన్నారు. ఈ సందర్భంగా అక్కడకు హాజరైన చిన్నారులు,స్థానిక అధికారులతో కలిసి పీవో నృత్యం చేశారు. పలు పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి,సర్పంచ్ పూనెం సరోజినీ, తహసీల్దార్ ఎన్. శ్రీధర్,ఎంపీడీవో ఫణీంద్ర,ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

గూడెంకొత్తవీధి: గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మండలంలోని రింతాడ పంచాయతీ కడుగుల గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో నాడు – నేడు కింద నిర్మించనున్న భవనానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి రూ.13 లక్షలు మంజూరు చేశారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, ఎంపీపీ కుమారి, సర్పంచి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు ఓంప్రకాశిని పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్


నిందితుడితో సీఐ జి.డి.బాబు

అరకులోయ రూరల్: గంజాయి కేసులో నిందితుడైన మండలంలో మాడగడ గ్రామానికి చెందిన శెట్టి వినయ్‌కుమార్(కట్‌రాజ్)ను అరెస్టు చేసినట్టు సీఐ జి.డి. బాబు సోమవారం తెలిపారు. గత సంవత్సరం గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న వినయ్‌కుమార్ తప్పించుకుంటూ తిరుగుతుండగా, ముందస్తు సమచారం మేరకు ఎస్ఐ కుమార్ బాబు, పోలీసు సిబ్బంది రాజాబాబు, కొండలరావు దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

క్లాప్ మిత్రల సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కిండంగిలో చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో పీఎస్ కుమార్

పాడేరురూరల్: చెత్త సంపద కేంద్రాల్లో పని చేస్తున్న క్లాప్ మిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ సూచించారు. మండలంలోని కిండంగి, మినుములూరు పంచాయతీ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గుత్తులపుట్టు సంత వద్ద ఉన్న చెత్తను ప్లాస్టిక్స్ సాయంతో పూడిక తీయించాలని పంచాయతీ కార్యదర్శి మత్స్యరాజును ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని సూచించారు.

గిరిజనులకు సీఆర్పీఎఫ్ దాతృత్వం


నుర్మతిలో గిరిజనులకు రేడియోలు అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ 198 బీఎన్ డీఎస్పీ ఉదయ్‌కుమార్


వై.రామవరం: వారపు సంతలో భోజనం పేకట్లు పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు

జి.మాడుగుల: పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలో పలు గ్రామాలకు చెందిన గిరిజనులకు, ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు రేడియోలు, క్యారం బోర్డులు, చెస్ బోర్డులు సీఆర్పీఎఫ్ 198బీఎన్ కంపెనీ డీఎస్పీ ఉదయ్‌కుమార్, సీఐ సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు, ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికార్లతో పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ హన్స్‌రాజు, ఆర్ఎస్ఐ రవి బాబు పాల్గొన్నారు.

వారపు సంతలో భోజనాలు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో వై.రామవరం వారపు సంతలోనూ ప్రభుత్వ కార్యాలయాలకు పనులపై వచ్చిన వారికి మొత్తం 160 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టరు వెంకటరమణ పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

చింతూరు: సీఆర్పీఎఫ్ డీ–141 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా ఏడుగురాళ్లపల్లి, పేగలో ఆదివాసీలకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడంతో పాటు భోజన సౌకర్యం కల్పించారు. మారుమూల గ్రామాలైన పూంగుట్ట, అల్లివాగులో నాలుగు సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ నందలాల్ తివారీ, చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్ఐలు కాశయ్య, యాదగిరి, వైస్ ఎంపీపీ యడమ అర్జున్, సర్పంచ్ సవలం సత్తిబాబు పాల్గొన్నారు.

దుకాణం సీజ్

హుకుంపేట: అక్రమంగా నిర్మించిన దుకాణాన్ని సీజ్ చేసినట్టు ఆర్ఐ రంగారావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద నిర్మించిన ఈ దుకాణాన్ని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గాయపడిన వ్యక్తి మృతి

మాకవరపాలెం: విద్యుత్‌షాక్‌తో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని వజ్రగడ గ్రామానికి చెందిన చుక్కల సత్తిబాబు(51) గత నెల 27న జంగాలపల్లిలో వ్యవసాయ మోటారు మరమ్మతు చేసేందుకు వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సత్తిబాబును విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మరణించడంతో సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.